# కోరిక

గేటు తీసుకొని లోపలికి ప్రవేశించారు ప్రసాదరావుగారు. ఆయన రాకకు ఎదురుచూస్తున్నట్లుగా, అందాన్నంతా తమలోనే యిముడ్చుకొన్న రంగు రంగుల పూలమొక్కలన్నీ తలలూచి స్వాగతం పలికాయి. పూల సౌరభాన్ని తనలో నింపుకొన్న పిల్లవాయువు మంద గమనంతో వచ్చి పలకరించి పోయింది. పున్నమి చంద్రుడు నక్షత్రకన్యల మెప్పుదలకోసమే అన్నట్లుగా తన కాంతినంతా విరజిమ్ముతున్నాడు. ఆ కాంతి ముందు తమ కాంతి వెలతెలా బోగా బేలగా చూస్తున్నాయి చుక్కలు. ఆ చల్లని, తెల్లని వెన్నెల్లో పూల పరిమళంతో నిండిన పిల్లగాలి ఆయనకు గిలిగింతలు పెట్టినట్లయింది. ఆయన పెదవులపై హాసరేఖ విరిసింది. ఆ యింటి ఆవరణలో అడుగుపెట్టిన ఆయనకు తీయని అనుభూతి, మానసికానందం కలుగుతాయి. దానిక్కారణం సుమతి. అవును.... సుమతే.... ఆమెతో ఎంతో కాలం పరిచయం లేకపోయినా ఎన్నో జన్మల బంధుత్వమేదో తమిద్దరిమధ్య ఉన్నట్లుగా ఉంటుంది. ఆమె ముగ్ధ మోహన సౌందర్యం, గంభీరత నిండిన చూపులు, మృదు మధుర కంఠస్వరము పెదవులపై విరిసీ విరియని చిరునవ్వు— ఆమెనొక ప్రత్యేకవ్యక్తిగా ఆయన హృదయంలో ఆమెకో ఉన్నత స్థానాన్ని కలిగించాయి. చుట్టూ పరికిస్తున్న ఆయన దృష్టి ఒక విరగబూసిన గులాబిమొక్క దగ్గర నిలిచిపోయింది.

హాలులో అడుగుపెట్టిన ఆయన్ని చూసిన వంటమనిషి అనంతమ్మ పలకరించింది. "ఊరి నుండి వచ్చేశారా బాబూ!"

"ఆఁ! సాయంత్రమే వచ్చాను. ఏది? సుమతి లేదా యింట్లో?"

"మేడమీద ఉంది బాబూ! పిలవమంటారా!" మెట్లవైపు వెళ్ళబోతున్న ఆమెను వారించి, "వద్దులే. నేనే వెళ్తాను." అన్నాడు.

మేడపైకి వెళ్ళిన ఆయనకు, బాల్కనీలో కుర్చీలో కూర్చొని, ఎటో దృష్టిసారించి, దీర్ఘాలోచనలో మునిగిన సుమతి కన్పించింది. వెన్నెల్లో వింతగా మెరుస్తున్న ఆమెను కొద్దిసేపలా చూస్తుండిపోయాడు. తెల్లని వెన్నెల్లో— ఆమె పచ్చని దేహచ్ఛాయ, నల్లని కురులు, ఎర్రని దుస్తులు - వివిధ రంగుల మేళవింపు.... అందమైన వర్ణచిత్రంలా ఉంది.

బ్రీఫ్‌కేస్ టేబిల్‌పై పెట్టి మెల్లగా ఆమెను సమీపించాడు. అడుగుల-

ఎ. మనోహరరావు



చప్పుడుకు వెనక్కి తిరిగిన సుమతి కుర్చీలోంచి లేచింది.

"ఎప్పుడొచ్చారు?" ఆమె కన్నుల్లో అతనూహించిన ఉత్సాహం కనపించ లేదు. ఊహ కందని భావమేదో కదులాడింది.

"యిప్పుడే వస్తున్నాను. ఏమిటంత దీర్ఘంగా ఆలోచిస్తున్నావు?" ఆమె చేతిని తన చేతుల్లోకి తీసుకుంటూ అడిగాడు.

"అబ్బే.... ఏంలేదు.... ఏమీ తోచక యిలా కూర్చున్నాను. వెళ్ళినపని పూర్తయిందా?" తడబాటుగా అని గదిలోకి దారితీసింది.

ఆమె వెనకాలే వస్తూ, "అయినంత వరకూ సవ్యంగానే అయింది. కాని అనుక్షణం నీవే గుర్తుకొచ్చేదానవు. అందుకే పని పూర్తికాకపోయినా వచ్చేశాను." ఆమె సంతోషంగా లేదు. ఆమె మనసంతా ఆలోచనల్తో నిండిఉంది. ముఖం గంభీరతను పులుముకొంది. అతనే మళ్ళీ అన్నాడు. "మళ్ళీ నాలుగైదు రోజుల్లో వెళ్ళాల్సుంది సుమతీ! నువ్వుకూడా తప్పకుండా రావాలి. ఈసారి మాత్రం ఎలాంటి సాకు చెప్పి తప్పించుకోడానికి వీల్లేదు." ఆ కంఠంలో నిండిన ఆప్యాయతకు ఆమె హృదయం చలించింది.

ఎర్రగులాబిని పొడుగాటి ఆమె జడలో తురుముతూ అన్నాడు. "సుమతీ! ఎర్రగులాబిని చూచినప్పుడల్లా నీవే గుర్తుకొస్తావు. ఎందుకో తెలుసా! గులాబిలోని మృదుత్వం, ముగ్ధత్వం నీలో ఉన్నాయి." ఆమె భుజాలుపట్టి తనవైపు త్రిప్పుకొని 'నా వూహ సరైనదే కదూ!' అన్నట్లుగా కళ్ళలోకి చూసాడు. అతని కళ్ళలోని కాంతిని చూడలేనట్లుగా చూపులు మరల్చి మంచంపై కూర్చుంది. దుప్పటిని సవరిస్తూ అంది. "భగవంతుడు దానినొక ఉద్దేశంతో సృష్టించాడు. కాని నేను.. విధాత వుబుసుపోక కత్తిరించి పారేసిన కాగితపు పూవుని." ఆ మాటల్లో వ్యక్తమైన నిరాశ, నిస్పృహలు అతని హృదయాన్ని తాకాయి. ఆ మాటల్లో దాగివున్న భావం గ్రహించడానికి ఆలోచనలో పడ్డాడు. అతని ముఖంలో సంతోషం మాయమయింది. కళ్ళలోని కాంతి కరిగిపోయింది

మౌనంగా ఉండిపోయిన అతని ముఖంలోనికి చూడ్డానికి ప్రయత్నిస్తూ 'ఆ మాట అనకుండా ఉండాల్సింది' అనుకొంది. చాలసేపు నిశ్శబ్దమావరించిందా గదిలో. అతను తీవ్రంగా ఆలోచిస్తున్నాడనడానికి నిదర్శంగా అతని ముఖంలో అనేక భావాలు ఆ భావాల్ని దాచుకోడానికో, ఆ ఆలోచనల్ల నుండి తేరుకోడానికో అన్నట్లు అతను లేచి, కిటికీ దగ్గరకు వెళ్ళి శూన్యంలోకి చూస్తూ కొంచెంసేపుండిపోయాడు. ప్రకృతి ప్రశాంతంగా, అప్పుడప్పుడు వినవచ్చే కీచురాళ్ళ రొదతప్ప, నిశ్శబ్దంగా ఉంది. పిండారబోసినట్లున్న వెన్నెల్లో ప్రతివస్తువు అందంగా, స్పష్టమైన ఆకృతి పొందాయి. గాలికి చెట్లఆకులు మెల్లగా కదులుతున్నాయి. ఆ కిటికీ గుండా వెన్నెల తెరలు తెరలుగా లోనికి పడ్తుంది.

"సుమతీ!" మెల్లని స్వరాన పిలిచాడు. నువ్వు మనసులో ఏదో బాధ పడ్తున్నావు. వచ్చినదగ్గర్నుండి చూస్తున్నాను. దిగులుగా, పరధ్యానంగా ఏదో ఆలోచిస్తున్నావు. కారణమేమిటి? ఏమైనా జరిగిందా! "

'అవును ప్రసాద్! నిజమే! ఈ రోజు నా మనసు చిత్రమైన వ్యధకు లోనౌతుంది. మీరు రాగానే నా మనసులోని ఆలోచనల్ని, అభిప్రాయాలను మనసు విప్పి చెప్పి నా మనసు తేలిక చేసుకోవాలనుకున్నాను. కాని ఎలా చెప్పను ప్రసాద్! నా అభిప్రాయం విన్న మీరెలా ఫీలవుతారు? నన్నర్థంచేసుకుంటారా? నన్ను క్షమించగలరా? లేదు లేదు నన్ను క్షమించలేరు అయినా నా మనసు మార్చుకోలేకపోతున్నాను ప్రసాద్! ఏం చేయను! ' ఆమె మనసు మూగగా ఆక్రోశించింది.

ఆమె మాట్లాడకపోయేసరికి, ఆమె మనసులో ఏదో బాధపడ్తుంది. తనతో చెప్పడానికి సంశయిస్తుందనుకున్నాడు. ఆమెను సమీపించి, నేల కభిముఖంగా ఉన్న ఆమె వదనాన్ని మునివేళ్ళతో లేవనెత్తి, కళ్ళలోకి చూసాడు గంభీరత నిండిన ఆ చూపుల్లోని భావమేమిటో అతనికి బోధపడలేదు.

"నువ్విలా ముభావంగా ఉంటే నేను భరించలేను సుమతీ! నీ బాధేమిటో నాతో చెప్పవా?" ఆ మాటల్లో నిండిన అనురాగం ఆమె మౌనాన్ని ఛేదించింది.

కంపిత స్వరంతో అతి మెల్లగా అంది. "ఎందుకో ప్రసాద్! ఈ రోజు ఏవేవో ఆలోచన్లు నా మనసు నిండా ముసురుకున్నాయి. నా గతం వర్తమానం భవిష్యత్తు ఈ సంఘం మనుష్యులు యివన్నీ గుర్తొస్తున్నాయి" కొన్ని క్షణాలాగి మళ్ళీ అంది "నేనొక దురదృష్టవంతురాల్ని ప్రసాద్! భగవంతుడు నాపట్ల ఎంతో నిర్దయగా ప్రవర్తించాడు. ఏ సుఖ సంతోషాలకూ నోచుకోని దౌర్భాగ్యురాలిని చేసాడు చిన్న చిన్న కోరికలు కూడ తీరక, ఆప్యాయతానురాగాలు కరువై కాలప్రవాహంలో గడ్డిపోచలా కొట్టుకుపోయాను అయినా నాకేం అత్యాశలు లేవు ప్రసాద్! ఉన్నవాటితోనే తృప్తిని వెతుక్కుందామన్నా, వాటిని కూడ దూరం చేసి నన్నొక ఆటబొమ్మలా చేసింది విధి నేనేం పాపం చేసాను? నాపై ఎందుకీ కక్ష!" దుఃఖంతో ఆమె గొంతు పూడుకుపోయింది

అతనామెను వింతగా చూస్తున్నాడు. వాళ్ళిద్దరకూ పరిచయమైన నాటినుండి ఏనాడు రెండు, మూడు మాటలకంటె ఎక్కువ మాట్లాడని సుమతి అంతగా బాధపడ్తూ మాట్లాడడం అతనికి విస్మయాన్ని, విచారాన్ని కలుగజేసింది ఈ రోజెందుకిలా మాట్లాడుతుంది! మాటలే కాదు ప్రవర్తన కూడా పూర్తిగా తెలుసుననుకున్న ఆమె యీ రోజు క్రొత్తగా కన్పిస్తుంది ఏదో జరిగి ఉంటుంది ఏవో సమస్యలతో ఆమె సతమతమౌతుంది. వాటి సంఘర్షణ ఫలితమే ఈనాటి ఆమె ప్రవర్తన ఆమె మాటల్లో వ్యక్తమైన భావం, బాధ అతని ఆలోచన్లని పదును పెట్టాయి. అక్కడే ఉన్న కుర్చీలో కూర్చొని, ఆమె మనోస్థితిని అంచనా వేయడానికి ప్రయత్నిస్తున్న అతనికి ఒక ఆలోచన కలిగింది అవును అదే కావచ్చు అదే కావచ్చు కుర్చీలోంచి లేచి మంచంవైపు నడిచాడు ఆమె ప్రక్కనే కూర్చుంటూ తనలో తనే చెప్పుకుంటున్నట్లు అన్నాడు.

"సుమతీ!" నీ బాధ నేనర్థం చేసుకోగలను. ప్రతి స్త్రీ తనొక గృహిణిగా సంఘంలో గౌరవ మరాదలు కలిగి ఉండాలని కోరుకుంటుంది దానిలో

అసమంజసమేమీ లేదు. యింతవరకూ నా పరిస్థితులు, నా సమస్యలు, నా ఆనందమే చూసుకున్నాను. కాని నీవైపు నుండి ఆలోచించలేకపోయాను! నన్ను క్షమించు సుమతీ! కాని కాని

నిన్ను మోసం చేయగలననీ, నీకు దూరంగా బ్రతకగలననీ అనుకోకు. యికనుండీ నీవు ఒంటరినన్న విషయాన్ని పూర్తిగా మరచిపో సుమతీ !"


"ప్రసాద్ !!" ఆమె అతనివేపు తల త్రిప్పింది ఆనందంతో, ఆవేదనతో ఆమె హృదయం బరువెక్కింది. 'లేదు ప్రసాద్! అంత ప్రేమకు నేననర్హురాల్ని. మీరు నా పట్ల చూపుతున్న ప్రేమాభిమానాలు, ఆప్యాయతానురాగాలు ఎంతో ఉన్నతమైనవి. నా హృదయానికి వాటిని భరించే శక్తిలేదు. వాటికి స్థానం కూడా లేదు. నేనశక్తురాల్నని మీకెలా చెప్పను? ఈ దురదృష్టవంతురాలిపై ఆశలు పెంచుకొని మీరు పిచ్చివాళ్ళు కావద్దని తెలుసుకోగలిగితే ఎంత బావుండును ప్రసాద్ !!'

ఆమె కన్నుల్లో సన్నని నీటితెర. ఆమె పెదవులు సన్నగా వణుకుతున్నాయి. ఆమె నుదుట పట్టిన చిరుచెమటను రుమాలుతో సున్నితంగా ఒత్తాడు. "ఈ అంతస్తు, హోదా యివేవీ నాకెక్కువకాదు. మన ప్రేమకున్నంత శక్తి ఈ కులంలో ఉందని నేననుకోను. ఈ విషయం మావాళ్ళర్థం చేసుకోలేరు. వాళ్ళకు నా ఆనందంకంటే అంతస్తు కులమే ఎక్కువ. వారికి నచ్చచెప్పాలని వాళ్ళ అంగీకారంతోనే మన వివాహం జరిపించుకోవాలని అనుకున్నాను. కాని అంతవరకూ నీకు దూరంగా ఉండలేకపోయాను యిక ఆలస్యం వద్దు. ఈ హోదా, అంతస్తు నాకక్కరలేదు. దైవ సన్నిధిలో మనం వివాహం చేసుకుందాం అప్పుడింక మనమెవరికీ భయపడనక్కరలేదు"

రెప్ప వాల్చకుండా అతన్నే చూస్తుండిపోయింది. 'పిచ్చి ప్రసాద్! నా బాధనిలా అర్థంచేసుకున్నారు. నేను దైవసన్నిధిలో మీచే తాళి కట్టించుకోడానికే బాధపడుతున్నానను కుంటున్నారు కదూ! నలుగురిలో మీ భార్యగా నాకు గుర్తింపు లేదనే నన్నింత మనోవ్యధకు గురిచేసిందనుకుంటున్నారు కాని పెళ్ళిలో ఎంత మహత్తుందో, తాళిబొట్టుకెంత విలువ, శక్తి ఉన్నాయో నాకు తెలుసు! పిచ్చి ప్రసాద్! నా బాధనిలా అర్థంచేసుకున్నారు. అదీ ఒకందుకు మంచిదే! నేను నిజం చెప్పలేకపోతున్నాను గదా!

ఆమె ఏమీ మాట్లాడకపోవడంతో మళ్ళీ అతనే అన్నాడు "నన్నింకా నమ్మలేకపోతున్నావా సుమతీ !!"

తనకలాంటి భావం లేదన్నట్లుగా చిన్నగా తలవూపి ఊరుకుంది జరుగబోయేదాన్ని గూర్చి ఆమె ఆలోచనల్లో




పడిపోయింది. కొద్దిరోజుల్లో తను అతనికి దూరమైపోతుంది యిప్పుడింత ప్రేమగా, ఆరాధనగా చూస్తున్న ప్రసాద్ అప్పుడెలా ఉంటారు? తన నెలా ఊహించుకుంటారు? తన నిర్ణయం ఆయనపై ఎలాంటి ప్రభావాన్ని కలిగిస్తుంది? కొద్దిరోజులు పోతే ఆయన తనకేమీ కాదన్న ఆలోచన ఆమె హృదయాన్నొక మూల పిండేస్తుంది. తమ పరిచయానికి వయసు తక్కువే అయినప్పటికి, ఆ కొద్దికాలమే తన జీవితంలో మధుర స్మృతులు నింపింది అతనందించిన ప్రేమాను రాగాలు, అతనితో గడిపిన మధుర క్షణాలు గుర్తొచ్చి, ఆమె హృదయం ద్రవించింది. ఆవేదన కన్నీటి రూపంలో బయటపడింది.

"యివి యివి అశ్రువులు కాదు"

"సుమతీ!!" అతనామెను హృదయానికి హత్తుకున్నాడు. ఆమె శిరస్సుపై తలనుంచి, మధురానుభూతి పొందుతున్న వాడిలా, తన్మయత్వంలో కనులు మూసుకొని చాలసేపలా ఉండిపోయాడు. ఆ అనుభూతి అణువణువును స్పృశించగా, ఆ క్షణాలలా శాశ్వతంగా నిలిచిపోవాలని కోరుకున్నాడు.

అతని చేతివేళ్ళు ఆమె వీపుపై సున్నితంగా కదులుతున్నాయి ఆమె కన్నీరు అతని గుండెల్లో యింకిపో తుంది ఆమె హృదయభారం తీరి, తేలికగా అన్పించగా, అన్ని సమస్యలు మరచి, ప్రశాంతంగా, చాలాసేపు ఉండి పోయింది తరువాత ఏదో జ్ఞాపక మొచ్చినదానిలా నెమ్మదిగా అతన్నుండి విడిపించుకొని లేచింది వాతావరణం

పెద్దవర్షం కురిసి వెలిసిన తరువాత ప్రశాంతతలా ఉంది.

"ఉండండి. యిప్పుడే వస్తాను!" ఆమె క్రిందకు వెళ్ళింది అతని దృష్టి ఎదుటి గోడపైకి మళ్ళింది. అక్కడ ఫుల్ సైజులో సుమతి ఫోటో ఉంది. గంభీరంగా ఉన్న ఆమె ముఖంలో విచిత్రమైన ఆకర్షణ. విశాలమైన నేత్రాలతో వింతగా చూస్తుంది. అలంకారాలేమీ లేకుండా సాధారణమైన దుస్తుల్లో నిండుతనాన్ని మూర్తీభవించుకొన్న ఆమె చిత్రాన్ని చూస్తున్న అయన మస్తిష్కంలో ఎన్నెన్నో ఆలోచనలు. ఆమెతో పరిచయమై యింకా సంవత్సరం కూడా కాలేదు. అంతకుముందు ఎవరికెవరో తెలియదు. పరిచయమైన తొలిచూపులోనే మనస్పందన. గత జన్మానుబంధమేదో ఉందన్న భావన హృదయారాధన. వ్యక్తం చేయలేని మధురానుభూతి సర్వం మరచి ఆమె ఒడిలో నిదురించాలని, ఆమె పరిష్వంగంలో కరిగిపోవాలని — ఏవేవో కోరికలు.

ఆమె వచ్చింది. చేతిలో చిన్న ప్యాకెట్టుతో.

"ప్రసాద్!!" అతను వెనుతిరిగాడు "ఈ రోజు, మీ బర్త్‌డే కదూ! ఈ చిన్న కానుక స్వీకరించండి!"

నీలిరంగు కాగితంతో చుట్టబడి, ఎర్రని రిబ్బనుతో కట్టబడి ఉందది. అతడు ఆశ్చర్యంగా చూసాడు. "నీ కెలా తెలిసింది?"

ఆమె చిన్నగా నవ్వి అంది "చాల రోజుల క్రితం ఏవో మాటల్లో మీరే చెప్పారు. మీకు గుర్తులేదేమో! నేను మాత్రం మరచిపోలేదు!"

ఆ మాట లతనికి ఎంతో ఆనందాన్ని కలిగించాయి. అపురూపమైన వస్తువులా ఎంతో జాగ్రత్తగా ఆ పాకెట్ అందుకొని విప్పాడు. అతని కళ్ళు సంతోషంతో మెరిసాయి. ప్రేమజంట రాధాకృష్ణుల పాలరాతి విగ్రహమది. తానే ప్రేమై, ప్రేమే తానై, తన్మయత్వంతో, కనులరమోడ్పులుకాగా, సర్వస్వాన్ని మరచిన రాధను, హృదయానికి హత్తుకొని, ప్రేమ పారవశ్యంలో మునిగిన మాధవుడు ఆ చిన్న కానుకద్వారా తన మనసుని, ప్రేమభావాన్ని వ్యక్తంచేసిన ఆమెదెంత సున్నితహృదయం!! రాధాకృష్ణుల్లా తాము కూడా ప్రేమమూర్తులుగా అనురాగానికి ప్రతీకలుగా నిలిచిపోతే!!

"సుమతీ! ఎంతోమంది ఎన్నో కానుకలిచ్చారు. కాని యింత అపురూపమైన కానుక నే నెవరిదగ్గరనుండీ పొందలేకపోయాను. యిది కేవలం విగ్రహంకాదు. మన ప్రేమకు ప్రతిరూపం. దీన్ని మన ప్రేమకు చిహ్నంగా. జీవితాంతం పదిలంగా భద్రపరచుకుంటాను!"

అతను లేచి, టేబిల్ పైనున్న బ్రీఫ్

కేస్ అందుకొని, మంచంపై తమిద్దరకూ మధ్యగా ఉంచి, తెరిచాడు. దానిలో ఆ విగ్రహాన్ని జాగ్రత్తగా సర్ది, దానిలో నుండి బంగారు రంగులోవున్న అందమైన చిన్న పెట్టెను తీసి, ఆమె కందించాడు. మూత తెరచి చూసిందామె. రాళ్ళేవీ లేకుండా, మంచి డిజైన్‌తో సింపిల్‌గా ఉన్న నెక్లెస్. దాన్ని ఒకసారి చూసి, మూసెయ్యబోతున్న ఆమెను వారించి, ఆ నెక్లెస్ తీసి ఆమె కంఠంలో అమర్చాడు.

"నీకు నచ్చలేదా !"

"  "

"యిది పెద్ద విలువైనది కాకపోవచ్చు కాని, మన పరిచయమైన తరువాత నేనిచ్చే తొలికానుక యిది. దీన్ని తిరస్కరిస్తే నాకు చాల మనస్తాపం కలుగుతుంది." ఆమె మనసులో అనుకుంది. 'తొలికానుకే కాదు తుది కానుక కూడ '

* * *

ఊరినుండి తిరిగొచ్చిన ప్రసాద్ దిగ్భ్రమచెందాడు, సుమతి ఆ వూరి నుండి ట్రాన్స్‌ఫర్ చేయించుకొని వెళ్ళిపోయి నాలుగు రోజులైందని తెలిసి, అతనికంతా ఆశ్చర్యంగా, నమ్మశక్యం గాకుండా ఉంది. ఏమిటిది! ఏం జరిగింది? సుమతెందుకు వెళ్ళిపోయింది? కనీసం మాట మాత్రంగానైనా తనతో చెప్ప లేదే! అసలు తననుండి దూరంగా వెళ్ళిపోవాల్సినంత అవసర మేమొచ్చింది? తనేం తప్పుచేశాడు? తన ప్రవర్తనలో లోపముందా? తనతో రమ్మని ఎంత అభ్యర్థించినా తిరస్కరించిందిందుకా! 'నేను లేని సమయం చూసుకొని బంధాన్ని తెంచుకోవాలనుకున్నావా? మన ప్రేమ ఎంతో ఉన్నతమైనదని, నేనెంతో అదృష్ట వంతుడనని అనుకున్నాను కాదు కాదు అనుకునేటట్లు చేసావు? నిన్ను పూర్తిగా అర్థంచేసుకున్నా ననుకున్నాను. కాని నీలో యిలాంటి ఆలోచనుందని అనుమానించలేకపోయాను. ప్రేమోన్నత శిఖరాల నధిరోహింపజేసి, ఒక్కసారిగా అగాధంలోని పడత్రోయ గలవని వూహించలేకపోయాను. .. నీకే మాత్రం బాధ కలగలేదా! సుమతీ! ఎలా వెళ్ళిపోగలిగావు !?' దెబ్బతిన్న మనసు పిచ్చిగా ప్రశ్నిస్తుంది. మంటలు రగుల్కొన్న అతని హృదయం కళ్ళలో ప్రతిఫలిస్తుంది. అతని మెదడునిండా ఎడతెగని ఆలోచన్లు సమాధానం తెలియని ప్రశ్నలు

దానికొక టే మార్గం వెళ్ళి సుమతినే అడగాలి ఎందుకిలా చేసిందో! తనకెందుకింత శిక్ష వేసిందో! తననెందుకు పిచ్చివాణ్ణి చేయాలనుకుందో !

లేదు లేదు తను వెళ్ళలేడు. కావాలని తననుండి దూరంగా వెళ్ళిపోయిన ఆమె దగ్గరకు వెళ్ళి, ఆమెను

బాధపెట్టలేదు. ఆమె ఏం కోరి తనను విడిచి వెళ్ళిపోయిందో, ఆ కోరిక తీరనీ! ఆమె అభిప్రాయాలకు తను అడ్డు చెప్ప లేదు హృదయాన్ని పిండుతున్న బాధ. ఆ బాధ భరించలేనివాడిలా అసహనంగా గదిలో పచార్లు చేస్తున్నాడు.

"బాబుగారూ !! సుమతమ్మగారు వెళ్ళిపోయే ముందు ఈ కవరిచ్చారు. జాగ్రత్తగా ఉంచి, మీరొస్తే యివ్వ మన్నారు." కవరందించి, తనపని పూర్తి అయిపోయినట్లు వెళ్ళిపోయింది అనంతమ్మ.

కవరు అందుకొని ఒక్కక్షణమలాగే ఉండిపోయాడు. దాన్ని చించి కాగితాలు తీసి చదవడం ప్రారంభించాడు.


* * *

ప్రసాదరావుగారికి,

యిలాంటి ఉత్తరం నా దగ్గరనుండి వస్తుందని ఊహించి ఉండరు. ఊహించని సంఘటనలు జరగడమే నేమో జీవితమంటె నన్నొక మనసులేని మనిషిగా మోసగత్తెగా అనుకుంటు న్నారు కదూ! దయచేసి ఈ ఉత్తరం సాంతం చదివి నన్నర్థం చేసుకోడానికి ప్రయత్నించండి.

నా గురించి పూర్తిగా మీకు తెలియదు. నేనొక దౌర్భాగ్యురాలిని ప్రసాద్! విధివంచితను. పుట్టకముందే తండ్రిని, ఊహ తెలియక ముందే తల్లిని పోగొట్టుకొన్న దురదృష్టవంతురాల్ని. మా మేనమామ విధిలేక నన్ను చేరదీసాడు అనాథనైన నేను అక్కడ కూడ అంతకంటె ఎక్కువగా బ్రతక లేకపోయాను. వాళ్ళు కొట్టినా, తిట్టినా, మౌనంగా భరిస్తూ హైస్కూలు చదువు పూర్తిచేసాను. అంతవరకైనా నేను చదవగలిగానంటే అది కేవలం మా టీచర్ల ప్రోత్సాహంవల్లనే! అక్కడ నుండి నాకు దినదిన గండంగా గడిచేది. ఇంటిచాకిరి అంతా చేసి, కడుపునిండా తిండిలేక దినమొక యుగంగా గడిచేది. నాకు భవిష్యత్తు అంధకారంగా కనిపించేది. నిస్సహాయురాలినైన నేను భారమైన మనసుతో రోజులు లెక్క పెట్టుకునేదాన్ని. రాను రాను వాళ్ళకి నా బరువు మోయలేనిదిగా అన్పించిం దేమో! అటు డబ్బు పెట్టి కాలేజి చదువులు చెప్పించలేరు. పోని కట్నం పోసి పెళ్ళిచేయలేరు! నన్నెంత కాలమని పోషిస్తారు? నాకు కూడ అక్కడ ఉండటం కష్టంగా అన్పించేది. ఎలాగైనా అక్కడనుండి వెళ్ళిపోవా లనుకున్నాను. కాని ఎటు వెళ్ళను? ఏం చేయను?

ఆ సమయంలోనే 'మోహన్' అనే అతను వచ్చి కట్నంలేకుండా నన్ను పెళ్ళిచేసుకుంటా నన్నాడు. ఎలాగైనా నన్ను వదిలించుకోవాలని చూస్తున్న మా వాళ్ళు అతని వివరాలేమీ కనుక్కో కుండానే పెళ్ళి నిశ్చయంచేశారు. నాకేం



చేయడానికి తోచలేదు. కోవెల్లో మా వివాహం నిరాడంబరంగా జరిగిపోయింది ఏమిటి ప్రసాద్! ఆశ్చర్య పోతున్నారా! నేను వివాహితనంటె నమ్మలేకపోతున్నారా! కాని అది పచ్చినిజం నాకు కూడా ఒక్కోసారి అన్పిస్తుంది. అలా జరగకుండా ఉంటే ఎంత బాగుండునని. కాని భూతకాలాన్ని, భవిష్యత్తులోకి తీసుకురావడం మానవ సాధ్యమేనా ?!

అతనితో జీవితం మూడునెలలు బాగానే గడిచింది ఆ తరువాత క్రమంగా అతని నిజస్వరూపం బయటపడింది. అతనికి లేని వ్యసనమంటూ లేదు. ఉద్యోగమేమిటో తెలియదు. అతను నన్ను పెళ్ళి చేసుకున్నది నాపై అభిమానంతో కాదు! నా అందంపైన కోరికతో! అతనికి నాపై ఉన్నది ప్రేమ కాదు! వాంఛ!! నా అందాన్ని అనుభవించాక, నాపై వాంఛ తీరాక నన్ను వదిలించుకోడానికి ప్రయత్నాలు ప్రారంభించాడు. క్రమంగా యింటికి రావడం మానేశాడు. నేను తింటున్నానో ఎలా ఉంటున్నానోనన్న విషయం అతని కక్కర్లేదు. నా బాధ ఎవరితో చెప్పుకోను? నేనెలా బ్రతకను? . నా అందమే నాకు శాపమౌతుందని నేనింత దుర్భరమైన బ్రతుకు గడపా ల్సొస్తుందని నేనూహించలేకపోయాను. ఒకసారి అతను యింటినుండి వెళ్ళి రెండు మూడు నెలలు గడచినా రాలేదు. నాకు జీవితంపైన ఏవగింపు. నాపై నాకే అసహ్యం నికృష్టమైన ఈ బ్రతుకు బ్రతికేకంటే చావడం మేలని తలచాను. ఒక అర్ధరాత్రి చావడానికని బయల్దేరాను. కాని ప్రసాద్! చూశారా!! ఈ విధి

ఎంత చిత్రమైనదో! విధి విన్యాసాలు ఎంత విచిత్రంగా ఉంటాయో! చావడాని కని బయల్దేరిన నాకు నా స్నేహితురాలు మాధవి ఎదురైంది. ఆమె శ్రీమంతుల బిడ్డ. మేమిద్దరం కలసి చదువుకున్నాం. ఆ రోజు ప్రక్కవూర్లో బంధువులింటికి పెళ్ళికి వెళ్ళి, తిరిగివస్తుంది కారులో. ప్రక్కనే వాళ్ళాయన కూడ ఉన్నారు. నన్నుచూసి కారు ఆపించి, దిగింది. ఆ అర్ధరాత్రివేళ ఒంటరిగా వెళ్తున్న నన్ను, నా అవతారాన్ని చూసి ఆమె అనుమా నించింది. ఏం జరిగిందని ప్రశ్నించింది. ఏమని చెప్పను? ప్రక్కన యింకోవ్యక్తి ఉన్నాడన్న సంగతి మరచి భోరున ఏడ్చాను. అన్నాళ్ళుగా నా గుండెల్లో పేరుకుపోయిన దుఃఖమంతా కరిగిపోయే ట్టుగా. నేను స్థిమితపడ్డాక, జరిగిం దేమిటో చెప్పమని, తనకు చాతనైన సహాయం చేస్తానని అనునయంగా అడిగింది. నా వివాహమైన నాటినుండి జరిగినదంతా చెప్పాను. నా పరిస్థితికి విచారం వ్యక్తంచేస్తూ, ఏం చేద్దా మన్నట్లు వాళ్ళాయనవైపు తిరిగింది. 'ఏం చేయాలో స్థిమితంగా ఆలోచించ వచ్చు. ముందు యింటికి పదండి' అన్నా రాయన. వాళ్ళ యింటికి వెళ్ళిన తరువాత కొద్దిరోజులు పోయిన తరువాత ఆయన 'టీచర్ ట్రెయినింగ్'కు అప్లికేషన్ తెచ్చారు. నేనెంతో సంతోషంగా జాయినయ్యాను. ఆ ట్రెయినింగ్ అయ్యేంతవరకూ అయిన ఖర్చులన్నీ వాళ్ళే భరించారు. నాకు ఆ ప్రక్కవూర్లోనే ఉద్యోగం వచ్చింది. అప్పటినుండి ఒంటరిజీవితాన్ని ప్రారంభించాను. అప్పటికే జీవితంలో అన్ని అనుభవాలను చవిచూసిన నా మనసు బండబారి పోయింది. యితర విషయాల్లో ఆసక్తి నశించిన నా మనసుని చదువుపై కేంద్రీక రించాను. బి. ఎ. పరీక్షకు చదివి పాసయ్యాను. నాకింకా కొద్ది అదృష్టం మిగిలిందేమో ప్రసాద్! కొద్దికాలం లోనే హైస్కూల్లో టీచర్‌గా ఉద్యోగ మొచ్చింది. క్లాసులో పాఠాలు చెప్పడం, యింటిదగ్గర పుస్తకాలు చదువుకోవడం యివే నా దినచర్యలు. వివాహమైన తరువాత భర్త అనురాగంలో, పిల్లల ఆలన పాలనలో అంతవరకు నేననుభ వించిన కష్టాల్ని, ఒంటరితనాన్ని మరచి హాయిగా గడపాలనుకున్నాను. కాని . నేను కన్న కలలన్నీ కల్లలైపోయాయి. పుష్పించకముందే కొమ్మలు నరుకబడ్డ వృక్షాన్ని నేను. తీరని కోర్కెలతో, నిరాశా నిస్పృహలతో నిండిన నా జీవితమొక అసంపూర్ణ చిత్రంలా తయారైంది. భయంకరమైన గతాన్ని పీడకలలా మరచిపోవడానికి ప్రయత్నించాను. చదువుపై మనసును లగ్నంచేసి, ఎం. ఏ. కూడ పూర్తిచేసాను.

ప్రసాద్! జీవితంలో ఏది ఎప్పుడు




ఎలా ఎందుకు జరుగుతుందో ఎవరూ చెప్పలేని తెలుసుకోలేని విషయం. కాలం ఎప్పుడూ ఒకేవిధంగా ఉండదు. కాలగమనంలో అనేక సంఘటనలు జరుగుతాయి. ఒక్కో సంఘటన జీవితాన్ని ఒకోవిధంగా మలుపు త్రిప్పుతుంది. అది మంచిదా, చెడ్డదా అన్న విషయం మళ్ళీ కాలమే తేల్చి చెప్పాలి. ఎం. ఏ. పూర్తిచేసిన నాకు రెండేళ్ళు గడిచేసరికి జూనియర్ లెక్చరర్‌గా ప్రమోషనొచ్చి, మీ వూరి జూనియర్ కాలేజీలో హిస్టరీ లెక్చరర్‌గా వేశారు. అది నా జీవితంలో పెద్దమలుపని యిప్పుడు తెలుసు కున్నాను.

ప్రసాద్ ! అంతవరకూ నా జీవితంలో ఎక్కువగా కష్టాలనే చవి చూశాను. అందరి మధ్యా ఉన్నా ఒంటరి గానే బ్రతికాను. ప్రేమ, అభిమానం, ఆప్యాయత, అనురాగం-యీ పదాలను వినడమేగాని వాటిని నేనెప్పుడూ అనుభవించలేదు. కాని మిమ్మల్ని చూసిన మొదటి క్షణంలోనే నాలో వింత అనుభూతి కల్గింది. అలాంటి అనుభూతి నా జీవితంలో క్రొత్త. నా మనసులో ముందెన్నడూ ఎరుగని స్పందన. ఏదో తెలియని సంచలనం. మీరు చిరపరి చితునిలా, ఆత్మబంధువులా ఆప్త మిత్రునిలా - అన్పించారు. ప్రేమాను రాగాలను ఎన్నడూ చవిచూడని నా మనసు, మీతో మాట్లాడాలని, మీ కంటి

వెలుగులో కరిగిపోవాలని, మీ హృదయంపై వాలి, యిన్నాళ్ళ నా బాధను మరచి, మనసు తేలికపరచుకోవాలని ఓహ్! ప్రసాద్! ఆ అనుభూతుల్ని నేను వ్యక్తంచేయలేను. కాని కాని ఏమిటీ కోరికలు ఈ రోజేమిటి నా మనసులో యిలాంటి కోరికలు కలిగాయి!.. నా మనసెందుకిలా ఆలోచిస్తుంది? నాకేమయిందీ రోజు నా వివేకం నశించిందా? లేకపోతే ఏమిటీ ఆలోచన్లు నా పరిస్థితేమిటి? యిలాంటి విపరీతమైన ఆలోచనెందుకు కలిగింది? ఏమిటి దీనికర్థం! దీని పరిణామమేమిటి? భయంతో నా శరీరం వణికింది మెదడంతా గజిబిజి ఆలోచనలతో నిండిపోయింది.

ఒకనాడు మీరు నా యింటికి వచ్చినప్పుడు, అలా జరుగుతుందని లేశమాత్రమైన ఊహించని నేను అమితాశ్చర్యానికి లోనయ్యాను. ఏదో తెలియని భావం నన్ను భయకంపితురాల్ని చేసింది మీరు మీరు ఎందుకొచ్చినట్లు! నా మనసు తెలుసుకున్నారా! నా మనోభావాల్ని గ్రహించారా నన్నేలా వూహించుకున్నారు? నా గుండెలు దడదడ కొట్టుకున్నాయి మీరు నన్ను ప్రేమిస్తున్నానని, నేనంగీకరిస్తే వివాహం చేసుకుంటానని, ఆలోచించి నా నిర్ణయం తెలియజేయమని చెప్పినపుడు, నా గుండె లయ తప్పింది. నేను వింటున్నది కలా? నిజమా? నా మెదడు ఆలోచించే శక్తి కోల్పోయింది. నా కంతా అయోమయంగా కన్పించింది! ఏం చేయాలి?... తన కర్తవ్య మేమిటి? తన గతాన్ని ఆయనకు చెప్పేస్తే అప్పటికీ ఆయన నిర్ణయం మారకపోతే ! తను సిద్ధమేనా, ఆయనతో వివాహానికి? లేదు లేదు తనకలాంటి ఉద్దేశం లేదు. తనకా అర్హతకూడా లేదు మరి తన ఉద్దేశమేమిటి? నా ఉద్దేశమేమిటో నాకే తెలియడంలేదు. నా మనసేమిటో, నాకేం కావాలో నేనేం చేయాలో నిర్ణయించుకోలేని పరిస్థితిలో కొన్నాళ్ళు గడిపాను. మీకేం చెప్పాలో తెలియక, ఆలోచిస్తున్నానని చెప్పి కొన్ని రోజులు గడిపేశాను. మళ్ళీ మీ రూపం, ప్రేమ నిండిన మీ మాటలు, సంస్కారపూరితమైన మీ ప్రవర్తన నన్ను మీ దగ్గరకు చేర్చాయి. ఎన్నాళ్ళగానో నా మనసులో మెదిలే కోరిక, నా హృదయపు పొరల్లో నిక్షిప్తంగా ఉండబడ్డ కోరిక బయటపడింది. ఒకప్రక్క పీడకలలాంటి గతం వికటాట్టహాసం చేస్తుంది. సమాజం, మనుషులు బెదిరిస్తున్నాయి మరోప్రక్క తొందరపెడ్తున్న కోరిక మీరు చూపుతున్న ప్రేమ మీవైపు లాగుతున్నాయి. వివేకం వెన్నుతడుతుంటే, స్వార్థం దాన్ని నశింప

జేస్తుంది. యిన్ని విధాల ఆలోచనలతో ఏదీ నిర్ణయించుకోలేక సతమత మయ్యాను. మీకు యివన్నీ చెప్పాలను కునేదాన్ని కాని నా అశక్తత నా నోరు నొక్కేది. అలాంటి అయోమయ స్థితిలో, ఒక బలహీన క్షణంలో నా సర్వస్వం మీకర్పించుకున్నాను కాని నేను చేస్తున్నపని సమంజసం కాదని, మిమ్మల్ని మోసంచేసానని నా మనసులో ఏ మూలో పీకేది. ఈ సమాజం, మనుషుల గురించి భయపడకపోయినా మీకు నిజం తెలిసిననాడు మీ ముఖం నేను చూడగలనా? అసలు మీరు నా ముఖం చూస్తారా? నన్నెంత హీనంగా, ఎంత స్వార్థపరురాలిగా ఊహించు కుంటారు? యిలాంటి ఆలోచన కలిగి నప్పుడు ఏదో తప్పుచేస్తున్నట్లు కృంగి పోయేదాన్ని. కాని మీరు నాయందు కనపరుస్తున్న వాత్సల్యానురాగాలు నన్ను పరవశింపజేసి, నా మనసుకు ఊరట కల్గించి, నా కోర్కెను రోజు రోజుకు పెంచాయి. పెరుగుతున్న స్వార్థం నాలోని విచక్షణాజ్ఞానాన్ని ప్రక్కకు నెట్టింది. నేను చెప్పదలచుకున్నవి నాలోనే ఉండిపోయేవి.

ప్రసాద్! మన వివాహానికి అంతస్తు, హోదా, కులం, నా పరిస్థితి అడ్డు వస్తాయి. మీ తల్లిదండ్రులు మన వివాహానికి అంగీకరించరని నాకు తెలుసు. అయినా మీకు భార్య కావాలని నాకెన్నడూ ఆశలేదు! నిజం ప్రసాద్! నాకా అర్హత లేదని తెలుసు! అందుకే వివాహప్రసక్తి మీరెప్పుడైనా తెస్తే మౌనంగా ఉండిపోయేదాన్ని. అన్నీ తెలిసినా మీకు దూరం కాలేక పోయాను దానికి కారణం నా కోరిక, స్వార్థం, బలహీనత. వీటికి బానిసనైన నేను మీకు చేస్తున్న అన్యాయాన్ని గుర్తించలేకపోయాను.

ప్రసాద్! ప్రతి స్త్రీ తల్లి కావాలని, మాతృత్వంలోని మధురానుభూతి అనుభవించాలని కోరుకుంటుంది. మాతృత్వం స్త్రీకి ప్రకృతి ప్రసాదించిన వరం. నేనూ అందరిలాగే ఆ వరాన్ని కోరుకున్నాను. విధి పరిహసించింది. అందరిపట్ల వరమైన ఆ కోరిక నా పట్ల శాపంగా మారింది. నేనేం తప్పుచేశాను? విధి, మనుషులు కలిసి నా జీవితంతో ఆడుకొన్నదానికి నేనా బాధ్యురాల్ని? బొమ్మలాటగా జరిగిన నా పెళ్ళి, మూన్నాళ్ళ ముచ్చటగా మిగిలిపోయింది. దానికోసం బాధపడ్తూ, జీవితాంతం ఒంటరిగా జీవించాలా? మరో వివాహం నేను చేసుకోకూడదా? చేసుకోవచ్చునని మీలాంటి విశాల హృదయులంటారు అంటే మాతృత్వానికి కూడ నేనర్హురాలినే గదా! యిప్పుడు అసమంజసంగా తోస్తున్న నా కోరిక అప్పుడు సమంజ మౌతుందా? మాంగల్యం అంత శక్తి

వంతమైనదీ, పవిత్రమైనదా? కాని మాంగల్యానికి అంత పవిత్రతుందని నేననుకోను। అంతకంటే ముఖ్యం మనసు కాదంటారా। దానికి లేని పవిత్రత మాంగల్యానికి ఆపాదించడం నేనంగీకరించలేని విషయం. అందుకే వివాహంపట్ల నేను సుముఖంగా లేను. నా కోరిక మీకు అసహజమైనదిగా, అసమంజసమైనదిగా, తప్పుగా కన్పించవచ్చు. కాని నాకలా అన్పించడం లేదు. నా మనసుకు నేను సమాధానం చెప్పుకోగలను. యిక సమాజమంటారా। దానికి నేను భయపడ్డంలేదు. నేనేమంత నేరం చేశానని భయపడాలి?

ప్రసాద్। యిప్పుడు నేను గర్భవతిని. మన ప్రేమఫలం, మీ ప్రతిరూపం నాలో జీవం పోసుకుంటున్నది. నేను నేను... తల్లిని కాబోతున్నాను ప్రసాద్। ఆ సంగతి తెలియగానే ఎంతో సంతోషపడ్డాను దానితోనే నీడలా భయంకూడా వెన్నాడింది నాలో మళ్ళీ సంఘర్షణ మొదలైంది. ఎన్నోవిధాల ఆలోచించాను. చివరకు ఒక నిర్ణయానికొచ్చాను. మన అనురాగానికి ప్రతిరూపంగా పుట్టబోయే బిడ్డతో నా మిగతా జీవితాన్ని సంతోషంగా గడపగలనన్న ధైర్యం నాకుంది. అందుకే మీనుండి దూరంగా వెళ్ళిపోవాలని నిశ్చయించుకున్నాను. నా నిర్ణయం మీపై ఎలాంటి ప్రభావాన్ని కలిగిస్తుందో। మీరు బాధపడ్తారు. దుఃఖిస్తారు। నన్ను అసహ్యించుకుంటారు। నన్నొక మోసగత్తెగా, స్వార్థపరురాలిగా చిత్రించుకుంటారు।... అయినా నా నిర్ణయాన్ని మార్చుకోలేకపోయాను. నా కోరిక నెరవేరిందన్న తృప్తి, నిజాన్ని దాచి మిమ్మల్ని మోసం చేసానన్న పశ్చాత్తాపం, మీ భవిష్యత్తుకు అడ్డుపడకూడదన్న భావం ఈ నిర్ణయాన్ని దృఢపరిచాయి నన్ను క్షమించి మరచిపొండి కాని మీ మంచి మనసును క్షోభ పెట్టానన్న భావం నన్నెప్పటికీ విడిచిపెట్టదు. ఉంటాను ప్రసాద్॥

మీకు ఏమీ కాలేని—

సుమతి.

ఉత్తరం పూర్తిగా చదివిన అతని మనసంతా శూన్యంగా తయారైంది. అచేతనుడై ఉండిపోయిన అతని చేతిలోని కాగితాల్ని, రివ్వున వీచిన గాలి దూరంగా, అతని కందనంత దూరంగా తీసుకుపోయింది.

